

మూఢ నమ్మకాలతో అనర్థాలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:'మీ కోసం మీ పోలీసు' కార్యక్రమంలో భాగంగా అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిఐ జీడి బాబు మూఢనమ్మకాలు, గంజాయి మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ జీడి బాబు మాట్లాడుతూ, గిరిజనులు అనారోగ్యానికి గురైతే ఆసుపత్రికి వెళ్లాలని, నాటు వైద్యం చేయించుకుని ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దన్నారు. డబ్బులకు ఆశపడి గంజాయి సాగు, విక్రయాలు, రవాణా చేసి యువత భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ జీడీ బాబు

మోడీ గో బ్యాక్

- ప్రధాని పర్యటనపై రాస్తారోకో, ర్యాలీలు
- విభజన హామీలు, గిరిజన సమస్యలు పరిష్కరించాలి
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి
- సిఐటియు, గిరిజన సంఘం, సిపిఎం నేతలు



నినాదాలు చేస్తున్న సిఐటియు, గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విశాఖపట్నంలో నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకులోయ నాలుగు రోడ్డు జంక్షన్ వద్ద రాస్తారోకో చేపట్టారు. మోడీకి వ్యతిరేకంగా గో బ్యా క్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హెూదా, రైల్వేజోన్, గిరిజన యూనివర్సిటీ, స్టీల్ ప్లాంట్‌పై బహిరంగ ప్రకటన చేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రా రాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేసి ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తామని గంటపదంగా చెప్పి రాష్ట్రానికి తీవ్ర మోసం చేశారన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హెూదా వంటి సమస్యలపై ప్రశ్నించవలసిన మోడీని ఆయన పర్యటనలో ఘనస్వాగతం ఎలా పలుకుతారని వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తూ సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణకు వ్యతిరేకమని నటిస్తూ దాని అమ్మడానికి సిద్ధపడిన నరేంద్ర మోడీని ఆహ్వానించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పాంగి రామన్న, కిండంగి రామారావు, సిఐటియు మండల నాయకులు వి.సింహాద్రి, దాసుబాబు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు టౌన్: విశాఖ ఉక్కుతో పాటు ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్న ప్రధాని మోడీకి విశాఖకు పర్యటించే హక్కు లేదని ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ అన్నారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను వ్యతిరేకిస్తూ శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఎఐఎస్ఎఫ్ నాయకుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విభజన హామీలు అమలు చేయాలని, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ ఊరుకోమని బిజెపి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: అటవీ సంరక్షణ చట్ట సవరణకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెస్తున్న బిల్లును తక్షణమే వెనక్కు తీసుకోవాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యాన స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో మోడీ గోబ్యాక్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రధాని మోడీ విశాఖ పర్యటనలో అటవీ సంరక్షణ చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకుంటామని, జిఒ 3 పునరుద్ధరణపైనా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మే నిర్ణయాన్ని వెన్నక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అద్యక్షులు కె జగన్నాథం, నాయకులు కె సూరిబాబు, కె ప్రవీణ్, కె దొరబాబు, గంగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో..



హకుంపేటలో ఆందోళన

కూనవరం : రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాని మోడీ విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఎం అధ్వర్యంలో కూనవరంలో శుక్రవారం నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మండల కార్యదర్శి పాయం సీతారామయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయొద్దని, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం నిర్వాసితులకు అర్ అండ్ అర్ ప్యాకేజీకి కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని, జిఒ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తాళ్లూరి శ్రీనివాస్, బి.బొజ్జయ్య, ఎం.బాబూరావు, ఎం.జోగయ్య, వెంకన్నబాబు, జె.వీరబాబు పాల్గొన్నారు.



కూనవరంలో...

హుకుంపేట: ఉద్యమ నాయకుల పై అక్రమ అరెస్టులు. సరికాదని అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు తెలిపారు. మండల కేంద్రంలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మోడీ పర్యటనపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రాకు అన్యాయం చేసి, విశాఖకు ప్రధాని మోడీ ఎలా వస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రత్యేక హెూదాపై మోడీ ప్రకటన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా గిరిజన మహిళ సంఘం జిల్లా నాయకులు సొంటేన హైమావతి, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సిపిఎం మండల కార్యదర్శి వి లక్ష్మణరావు, రామారావు, గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ, ప్రమీల, సీఐటీయూ నాయకులు వాసు, నారాయణ, సన్నీ బాబు, మోహన్‌రావు, గోపాల్, నాగేశ్వరరావు, అనిల్ కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు, నాయకులు

రాష్ట్రంలో విద్యా రంగం నిర్వీర్యం

-యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వరరావు
-గిరిజన పాఠశాలల్లో సమస్యలపై ఆరా
-20న పాడేరులో రాష్ట్ర సదస్సుపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనంతగిరి::రాష్ట్రంలో విద్యా రంగం పూర్తిగా నిర్వీర్యమైందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పలు పాఠశాలలల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పెద్దబిడ్డ, బొర్రా బాలుర పాఠశాల, అనంతగిరి బాలికల వన్, టూ పాఠశాలల్లో సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. తరగతి గదులు, హాస్టల్ వసతి, మంచినీరు, భోజన సదుపాయం వంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం నిర్వీయానికి కుట్ర పన్నుందని, దీనిలో భాగంగానే పాఠశాలలను విలీనం చేసిందన్నారు.నాడు నేడు పథకం పేరుతో పాఠశాలల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో పనులు జరగలేదని, పథకం మంచిదైనప్పటికీ కోట్లది రూపాయలు నిధుల లేక పోగా ఖర్చులు పెరిగాయన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న పాఠశాలల్లో చాలీచాలని గదుల్లో తరగతులు, హాస్టల్‌లో సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు.నాణ్యమైన భోజనం, కాస్మొటిక్స్, నోటు పుస్తకాలు, దుస్తులు వంటి సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని ఆయన విమర్శించారు. సరైన మౌలిక వసతి సౌకర్యాలు, నాణ్యమైన విద్య, రుచితో కూడిన ఆహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.జీవో 3 పునరుద్ధరణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఉపాధ్యాయుల ప్రమోషన్లు చేపట్టలేదని, పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. భాష వాలంటీర్లను కొనసాగించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐటీడీఏల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తామని ఆయన తెలిపారు.

'చలో పాడేరు' పోస్టర్ ఆవిష్కరణ

ఈనెల 20 తేదీన పాడేరులో జరిగే రాష్ట్రవ్యాప్త సదస్సుకు ఉపాధ్యాయ సిబ్బంది హాజరై విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బాలికల పాఠశాల వన్‌లో చలో పాడేరు సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతంలో విద్యారంగంలో సమస్యలు తెలుసుకునేందుకు యుటిఎఫ్ జీపు జాతా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. జీపుజాతా ద్వారా తెలుసుకున్న సమస్యలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా యుటిఎఫ్ కౌన్సిలర్ అంబేద్కర్, మండల యుటిఎఫ్ నాయకులు పి. దేవుడు, ఎస్.రాంబాబు, ఎన్.మల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బి.మంగా, మల్లేశ్వరి, అప్పలస్వామి పాల్గొన్నారు

ఖాళీ బిందెలతో ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని చిన్నల బుడు పంచాయతీ హట్టగూడ గ్రామంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డు పై బైఠాయించి నిరసన చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు గొల్లూరి పద్మ, యువ నాయకులు మొస్య ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, హట్టగూడ గ్రామంలో సుమారు 150 కుటుంబాలు 800 మంది గిరిజనలు ఉన్నారనీ, తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి గ్రామంలో ఉందని చెప్పారు. గతంలో సుమారు రూ.5 లక్షలు ఖర్చు పెట్టి నామమాత్రంగా కుళాయి నిర్మాణం చేపట్టారని, కొద్ది రోజులకే మరమ్మతులకు గురై పని చేయక పోవడంతో గ్రామంలో తాగడానికి చుక్కనీరు లేని పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. (ఈ కార్యక్రమంలో గొల్లూరి కొండమ్మ, గొల్లూరి ఊర్మిళ, అరడ కాంతమ్మ, మజ్జి రామమూర్తి, బురిడీ దయామంత్, కిల్లో జగబంధు, పాంగి లైకోన్ పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న మహిళలు



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి తదితరులు

ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని డౌనూరు సచివాలయం పరిధిలో 175 మంది లబ్ధిదారులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను ఎంపిపి బడుగు రమేష్, జెడ్‌పిటిసి వారా నూకరాజు, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబు, డౌనూరు, మూల పేట సర్పంచులు పొట్టిక గంగా భవానీ, రావుల వెంకట లక్ష్మి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్జయదొర, గాడి సత్తిబాబు, బండి సుధాకర్, నెబుల లక్ష్మణరావు, నిలపు సూరిబాబు, దుచ్చరి బుజ్జి, దేపూరు చినపోతురాజు, సురేష్ పట్నాయక్, రాజుబాబు, బుక్కా చిన్నబ్బాయి, పొట్టిక పోతురాజు, రావుల సింహాచలం, హనుమంతరావు, పాపారావు భవానీ పాల్గొన్నారు.

'జనసేన బలోపేతానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి- విఆర్ పురం

మండలంలోని అన్ని గ్రామాల్లో జనసేన పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యాకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ పిలుపునిచ్చారు. విఆర్.పురంలో శుక్రవారం పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. జనసేనా పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కనుగుల శ్రీనివాస్ రెడ్డి, బాగుల అంజనరావు, కెచ్చెల పోషి రెడ్డి, ములకల కష్నార్జున రావు, కత్తాల హేమంత్, పెడపెట్ల పవన్ కళ్యాణ్, కోట్ల మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తామరపల్లిలో డ్రై డే

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని తామరపల్లిలో మలేరియా కేస్ రావడంతో తామరపల్లి-2వ వీధిలో ఉన్న ప్రతి ఇంటికి శుక్రవారం స్ప్రెయింగ్ చేయంచడం జరిగింది. ఫ్రైడే డ్రై డేలో భాగంగా నీళ్ల నిల్వఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం జిపిఎస్ స్కూల్‌ను సందర్శించి పిల్లతో కలిసి భోజనం చేశారు. తరవాత ఐరన్ టాబేలెట్స్ వేశారు. ఈ కార్యక్రమంలో ముసురిమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజంలి, వైస్సార్సీపీ నాయకులు బాప్పన్న దొర, సూపర్వేసెర్ వెంకటేశ్వర్లు, హెల్త్ అస్సిటెంట్ సతీష్, మలికార్జున్, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.



నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిస్కరించాలంటూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని డి.మల్లవరం గ్రామ గిరిజనులు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యాలయం ఎదుట బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అద్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ డి.మల్లవరం గ్రామంలోని సమస్యలపై అనేక పర్యాలు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రహదారి సదుపాయం సక్రమంగా లేక గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణం మధ్యలో ఆపివేశారని, దీంతో అంగన్వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిరహిస్తున్నారని తెలిపారు. తక్షణం నూతనభవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో వీధిరోడ్లు, డ్రైన్లు, విద్యత్ లైట్లు, కొండపోడు పట్టాలు వంటి సమస్యలు పరిస్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఓ కె.బాపన్నదొర, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణకు వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె జగన్నాథం, కె సూరిబాబు గిరిజనులు కె ప్రవీణ్, కె దొరబాబు, గంగరాజు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

యూనియన్ బ్యాంకు వార్షికోత్సవం

ప్రజాశక్తి -సీలేరు

యూనియన్ బ్యాంక్‌లో 104వ వార్షికోత్సవం జీకే వీధి మండలం సీలేరు యూనియన్ బ్యాంకులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, మేనేజర్ ప్రవీణ్ కుమార్, బాలాజీ లాడ్జి ఓనర్ బాలాజీ చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 103 సంవత్సరాలు పూర్తి చేసుకుని 104 సంవత్సరంలో అడుగుపెడుతున్న తరుణంలో వార్షికోత్సవం జరుపుకోవడం ఎంత ఆనందంగా ఉందన్నారు. యూనియన్ బ్యాంకు ముంబైలో 1919 నవంబర్లో సీతారాం పోదార్, స్థాపించారని పేర్కొన్నారు. అంచలంచెలుగా భారతదేశంతో పాటు ఇతర దేశాలలో 8,900 యుబిఐ బ్రాంచ్‌లు విస్తరించినట్లు చెప్పారు. యూబిఐ బ్యాంకుల ద్వారా రూ.18 లక్షల కోట్లు టర్నోవర్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూబిఐ అసిస్టెంట్ మేనేజర్ శంకర్ సాహు, క్యాషియర్ అవినాష్, సోమేన్ జాన్ సిబ్బంది విశ్వనాథం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్ ద్వారా అందించే సేవలు ఖాతాదారుల సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ఆర్ మహేష్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఏర్పడి 103 పూర్తి అయిన నేపథ్యంలో ఆ బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో రూ.1.50లక్షలతో నిర్మించిన టాయిలెట్స్ బ్లాక్‌లను యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆర్.మహేష్ రెడ్డి, ఎంపిడిఓ కె బాపన్నదొర, స్థానిక ఎస్ఐ టీజి నరేంద్ర ప్రసాద్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మహేష్ మాట్లాడుతూ బ్యాంకు అందించే సేవలు అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సత్యవేణి సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎంపిటిసి, బ్యాంకు అధికారులు



యూనియన్ బ్యాంకు నిర్మించిన టాయిలెట్స్ వద్ద అధికారులు



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న కుందులూరు గ్రామస్తులు

తాగునీటి సమస్యపై ధర్నా

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని కుందులూరు పంచాయతీ పరిధి మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజలు నీళ్ల లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి ట్యాంకు రిపేరులో ఉందని, మంచినీళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రహదారి లేక టేకులూరు నుండి కుందులూరుకు నిత్యవసరాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మంచినీరు, వీధిలైట్లు సమస్యలను పరిష్కరించాలని, కుందులూరు నుంచి టేకులూర్ వరకు బీటీ రోడ్డు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం మండల నాయకులు వడ్లాది రమేష్, బుచ్చయ్య, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - మారేడుమిల్లి

ఈనెల తొమ్మిది, పది తేదీలలో రంపచోడవరం డివిజన్ స్థాయిలో ముసలిమిల్లి ఆశ్రమ పాఠశాలలో జరిగిన క్రీడలలో మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సీనియర్ విభాగం నుండి వాలీబాల్, షార్ట్ పుట్‌లో పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లోనూ, జూనియర్ విభాగం నుండి చెస్, క్యారమ్స్ ప్రథమ స్థానంలో గెలిసి జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను, పిడి సుదర్శన్, పిఈటి కె.రామదాసు, జయప్రసాదును పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రామారావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్న విష్ణు దొర అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల హెచ్ఎం, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్

ఘనంగా ఆజాద్ జయంతి


నివాళి అర్పిస్తున్న కలెక్టర్, పిఒ

ప్రజాశక్తి-పాడేరు: భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు శుక్రవారం ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి జె.శివ శ్రీనివాసు, ఐటీడీఏ పీఓ రోణంకి గోపాలకృష్ణలు ఆజాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, మొదటి విద్యా శాఖ మంత్రి గా పని చేసిన అబుల్ కలాం మంచి విద్యా విధానానికి పునాది వేశారని, నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేశారని కొనియాడారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా దీర్ఘకాలిక వ్యూహంతో విద్యా విధానాలు ప్రవేశపెట్టి విద్యా వ్యాప్తికి పెద్ద ఎత్తున కృషి చేసారని కలెక్టర్ వివరించారు.

జెసి శివ శ్రీనివాసు మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్ కీలక పాత్ర పోషించారని, ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి కృషి చేశారని పేర్కొన్నారు. వార పత్రిక ప్రారంభించి ప్రజలలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నింపారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం పత్రికను నిషేధించిందడంతో మరో పత్రిక స్థాపించి ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారని తెలిపారు.

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ, యుక్త వయస్సులోనే భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారని, దేశ విభజన, ఇతర సందర్భాల్లో మతపరమైన దాడులు జరుగుతున్నప్పుడు ఆజాద్ ఉద్రిక్తతలు తగ్గించుటకు ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాల కులు కొండలరావు, జిల్లా విద్యా శాఖాధికారి రమేష్, ఐసీడీఎస్ పిడి సూర్యలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి నందు, జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం పరిపాలనాధికారి విఎస్ ఎస్ఎన్ శర్మ, క్రిష్టియన్ కార్పొరేషన్ క్షేత్ర సహాయకుడు జయప్రకాష్ పాల్గొన్నారు.

స్పందనకు వినతుల వెల్లువ


అర్జీ దారుల నుండి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆయా మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. రహదారుల నిర్మాణాలు, తాగునీటి సదుపాయాలు, అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలపై 118 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లడుతూ, స్పందనలో సమస్యల పరిష్కారం, కోర్టుల కేసుల కౌంటర్ ఫైలు వేయడంలో అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రతీ రోజు అధికారులకు స్పందన రిపోర్టు పంపిస్తున్నామని వాటి పరిష్కారానికి దిగువ స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.
పాడేరు మండలం మినుములూరు గ్రామానికి చెందిన లంకెల చిట్టమ్మకు రూ.6 లక్షల 47వేలు రైస్ అండ్ ఫ్లోర్ మిల్ ఏర్పాటు చేసుకునుటకు, హుకుంపేట మండలం తడిగిరికి చెందిన పరదాని నిరోషకు రూ.2 లక్షలు మిల్లెట్ ఫ్లోర్ మిల్ ఏర్పాటు చేసుకునుటకు, హుకుంపేట మండలం శోభకోట గ్రామానికి చెందిన పాలసీ భవానికు రూ.2లక్షలు మిల్లెట్ ఫ్లోర్ మిల్ ఏర్పాటుకు హెచ్ఒ రుణాలు మంజూరు చెక్కులు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, జెసి చేతులమీదగా పంపిణి చేసారు.

పాడేరు మండలం వంజంగి గ్రామం నుండి శాంతి కుమారి ఆశా కార్యకర్తగా నియమించాలని వినతి పత్రం అందించారు. హుకుంపేట మండలం కొట్నపల్లి పంచాయతీ సర్పంచ్ కరెంటు స్తంబాలు ఏర్పాటు చేయాలని కోరారు. చింతపల్లి మండలం అన్నవరం గ్రామా పంచాయతీ నుండి కొండపోడు భూములను సర్వే జరిపించి కొండపోడు పట్టాలు ఇప్పించాలని వినతి పత్రం అందించారు. కొయ్యూరు మండలం బూదరాళ్ళ పంచాయతీ సల్దిగెడ్డ గ్రామా గిరిజనులు విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. పెదబయలు మండలం సీతగుంట గ్రామం గ్రామస్తులు కుళాయి నీరు సమస్య పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, ఇఇలు డివిఆర్ఎం రాజు, కె.వేణు గోపాల్, డిఇఇ డా.పి.రమేష్, పిఆర్ ఇఇలు కె.లావణ్య కుమార్, కొండయ్యపడాల్, ఎడిఎంహెచ్ఒ కె.లీలాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమకారుల అరెస్టు సిగ్గుచేటు

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయవద్దని, గత 638 రోజులుగా నిరసన చేస్తున్న దీక్షా శిబిరంలోని కార్మికులను, నాయకులను మోడీ మెహర్బానీ కోసం అరెస్టు చేయడం సిగ్గుచేటని అల్లూరి జిల్లా సిపిఎం కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి పర్యటన పేరుతో ప్రశాంతంగా దీక్షలో కూర్చున్న కార్మికులను, నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. వైసిపి ప్రభుత్వం ఒకవైపు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వద్దంటూనే మరోవైపు బిజెపి ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకోవడానికి అరెస్టులు చేయిస్తోందని విమర్శించారు.గత 638 రోజులుగా దీక్షలు జరుగుతున్నా విశాఖ నగరం ప్రశాంతంగానే ఉందని, అనేకమంది ప్రముఖులు నగరాన్ని సందర్శించారని, ప్రధాని పర్యటనకు ఈ దీక్ష ఎటువంటి ఆటంకం కల్గిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక తలారిసింగి జి.టి.డబ్యూ సిఏహెచ్ బాలుర స్కూల్‌లో అటల్ టింకరింగ్ లాబ్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచు కోవాలన్నారు. ల్యాబ్‌లో అత్యాధునిక టెక్నాలజీతో ఉన్న వర్కింగ్ మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించి వాటి పనితీరును కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ విద్యార్థులను అభినందిస్తూ నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. అటల్ టింకరింగ్ లాబ్ జిల్లాలో 11 మండలాలకు హబ్ గా ఏర్పటు చేయడం జరిగిందని, తద్వారా టీచర్స్‌కు, విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీలో శిక్షణ ఇప్పిస్తామని స్టెమ్ రోబో టెక్నాలజీ నిర్వాహకులు తెలిపారు.

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడతూ, చిన్న వయసు నుంచి పిల్లలకు వినూత్న ఆలోచనలు, టెక్నాలజీ, రోబోటిక్స్‌పై అవగాహనన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ కొండలరావు, డి ఇఒ రమేష్, ఏ.టి.డబ్యూఒ రజని, స్టెమ్ టెక్నాలజీ సిబ్బంది పాల్గున్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణపై నిరసన


ఆందోళన చేస్తున్న నేతలు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రధానమంత్రి పర్యటనలో బహిరంగంగా ప్రకటించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జీ.దయానిధి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ముకుంద్, జగన్నాథం, మధుసూదన్ రావు పాల్గొన్నారు.

హాస్టళ్లలో అటకెక్కిన మెనూ అమలు

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభు



మోనూను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి- పాడేరు: మండల కేంద్రంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహాన్ని శుక్రవారం సాయంత్రం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభు సందర్శించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అధికారులకు ఎన్నోమార్లు హెచ్చరించినా జూనియర్ కళాశాలలో మెనూ పూర్తిగా అమలైన దాఖలు లేవని ప్రభు చెప్పారు. మెనూ అమలు చేయక పోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ అధికారులకు పిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నితీష్ కుమార్ పాల్గొన్నారు.

చర్మవ్యాధులతో విద్యార్థులు సతమతం


చర్మవ్యాధులను పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేత శ్రీను

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు 1, బాలురు 2 లను శుక్రవారం గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను సందర్శించారు. విద్యార్థులు గజ్జి, దురద, తామర వంటి చర్మ వ్యాధి లక్షణాలతో సతమతం అవుతున్నారని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు లేక పోవడంతో విద్యార్థులు పలు చర్మ వ్యాధుల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. విద్యార్థులకు సబ్బులు, నూనెలు, తదితర మౌలిక వస్తువులు ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెరుగైన కాస్మోటిక్ సప్లై చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాలురు ఆశ్రమ పాఠశాలలలో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి, మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర డోంబ్రు, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు పాంగి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించని రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సుతోపాటు గుర్తింపు రద్దు చేస్తామనిరాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రెండో శనివారం సెలవు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇటీవల ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యాలతో కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో సమావేశంలో దీనిపై కమిషన్ స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు. కచ్చితంగా నిబంధనల అమలుకు అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు కమిషన్ సూచనలు చేసిందన్నారు. పూర్తి స్థాయిలో అమలుకు నిరంతర పర్యవేక్షణ జరపాలని, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించిందన్నారు. కమిషన్ ప్రతినిధులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పాఠశాలల నిర్వహణలో లోపాలను గుర్తించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం సెలవు రోజుల్ల పాఠశాలలు తెరిస్తే, తగు ఆధారాలతో apscpcr 2018@gmail.comకు గానీ, సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారికిగానీ ఫిర్యాదు చేయాలని కోరారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జాతీయ, రాష్ట్రీయ న్యాయ సేవాధికార సంస్థల ఆదేశంతో విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాలలో జాతీయ లోక్‌అదాలత్ జరగనుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి తెలిపారు. దీన్ని జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకొని, న్యాయపరమైన సమస్యలను రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఇప్పటికే జిల్లాలోని పోలీస్ అధికారులతోనూ, జీవీఎంసీ, బ్యాంక్, ఇన్సూరెన్స్ వంటి తదితర సంస్థలతోనూ అవగాహన సదస్సులు నిర్వహించి ఈ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారానికి చొరవ చూపినట్లు తెలిపారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారానికి సంసిద్ధతను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బులికృష్ణ తెలిపారు.

పాఠశాలలో వన భోజనాలు

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక రెసిడెన్సియల్ బాలుర పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డి శంకరావు, డిప్యూటీ వార్డెన్ ఎల్.శంకర్రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్తీక మాసం వన భోజనాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణను చూడచక్కని విధంగా తీర్చిదిద్దారు. వివిధ జానపద గీతాలకు విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

పశువులకు టీకాలు


టీకాలు వేస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి - పెదబయలు : మండలంలోని లింగేటి పంచాయతీలో పశు వైద్యాధికారులు సుమారు 72 పశువులకు లంపి వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మోడీ పర్యటన నేపథ్యంలో.. విశాఖలో అరెస్టుల పర్వం


ఉక్కు కార్మికులను అరెస్టు చేసి పెందుర్తి తరలిస్తున్న పోలీసులు

'ఉక్కు' కార్మికులు, సిపిఎం, సిపిఐ నాయకుల అరెస్టు
కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ శిబిరంపై పోలీసుల దాడి
55 మంది పలు పోలీస్ స్టేషన్లకు తరలింపు

ప్రజాశక్తి - ఉక్కునగరం, పెందుర్తి, ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్

ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో శుక్రవారమంతా విశాఖ జిల్లాలో అరెస్టుల పర్వం కొనసాగింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మబోమని ఈ నెల 12న జరిగే బహిరంగ సభలో ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలంటూ ఉద్యమిస్తున్న ఉక్కు కార్మికులపైనా, సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులపైనా పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. 55 మంది విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులను అరెస్టు చేసి పెందుర్తి, సబ్బవరం, స్టీల్‌ప్లాంట్, పెదగంట్యాడ పోలీస్ స్టేషన్లకు తరలించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడును శ్రీనగర్ వద్ద అడ్డుకుని తొలుత మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కూ, అక్కడి నుంచి భీమిలి పోలీస్ స్టేషన్‌కూ తీసుకెళ్లారు. సిపిఐ నేతలనూ పలుచోట్ల పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రధాని మోడీ ఉపసంహరించుకోవాలంటూ శుక్రవారం ఉదయం కూర్మన్నపాలెం వద్దనున్న ఉక్కు దీక్షా శిబిరం వద్ద పెద్ద సంఖ్యలో ఉక్కు కార్మికులు నిరసన చేపట్టారు. పోలీసులు చుట్టుముట్టినా 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదాలను హోరెత్తించారు. అనంతరం అక్కడే జరుగుతున్న దీక్షా శిబిరంలో ఉక్కు కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి పోరాటానికి టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ గంగారావుతోపాటు పలువురు వామపక్షాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ దీక్షా శిబిరంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోలీసులు శిబిరంపై దాడి చేసి దీక్షల్లో కూర్చున్న 49 మందిని అరెస్టు చేసి వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ జె.అయోధ్యరామ్, ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ తదితరులు ఉన్నారు. అరెస్టు కాబడి పెందుర్తి స్టేషన్‌లో ఉన్న నేతలను సిపిఎం నాయకులు బి.రమణి, ఐద్వా నాయకులు లావణ్య, అనంతలక్ష్మి సిఐటియు నాయకులు శంకరరావు, సింహాచలం, అప్పలనాయుడు పరామర్శించి సంఘీభావం తెలిపారు.

సిపిఎం, సిపిఐ నేతల అరెస్టులు, గృహ నిర్బంధం

కూర్మన్నపాలెంలోని 'ఉక్కు' దీక్షా శిబిరం వైపునకు వస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడును శ్రీనగర్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. తొలుత మల్కాపురం, ఆ తరువాత భీమునిపట్నం పోలీస్ స్టేషన్లకు తరలించారు. అలాగే సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రలను శుక్రవారం సాయంత్రం అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిని టూ టౌన్ స్టేషన్‌కు తరలించారు. విశాఖలోని పలువురు ఉద్యమకారులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు.


అక్రమ అరెస్టులు దారుణం : సిపిఎం

కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద శాంతియుతంగా దీక్షలు చేస్తున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులను, వారి కుటుంబీకులను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం అత్యంత దుర్మార్గమని, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడును శ్రీనగర్ వద్ద అడ్డగించి అరెస్టుకు పూనుకోవడం దారుణమని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీలు పేర్కొన్నాయి. అక్రమ అరెస్టులను సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఖండించారు. విభజనతో తల్లడిల్లుతున్న ఆంధ్ర రాష్ట్రానికి విభజన చట్టం ప్రకారం ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, వెనుకబడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజీ, పోలవరంకు నిధులు వంటి అనేక సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వాటిని ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్న నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు వస్తుంటే కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం, స్టీల్‌ప్లాంట్ కోసం పోరాడుతున్న వారిపట్ల పోలీసు బలగాలను ప్రయోగించి అరెస్టులు చేయించడం సిగ్గు చేటన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్న వారిని అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రజల పట్ల చిత్తశుద్ధి వుంటే రేపు సభా వేదికపై నరేంద్ర మోడీ చేత స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రకటింపజేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజా క్షేత్రంలో దోషులుగా నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. అక్రమ అరెస్టులను విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఖండించింది. ఈ మేరకు ఛైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంతటి నిర్బంధం విధించినా శనివారం కూడా నిరసనలు జరిపి తీరుతామన్నారు. అరెస్టులను పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

మోడీ సభను బహిష్కరిస్తున్నాం : సిపిఎం, సిపిఐ ఫ్లోర్ లీడర్లు

శనివారం విశాఖలో జరుగుతున్న దేశ ప్రధాని మోడీ బహిరంగ సభను బహిష్కరిస్తున్నట్లు జివిఎంసిలో సిపిఎం, సిపిఐ ఫ్లోర్ లీడర్లు డాక్టర్ బి.గంగారావు, ఎజె.స్టాలిన్ తెలిపారు. ఈ మేరకు వారు మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి లేఖ రాశారు. సభకు తమను రమ్మంటూ విఐపి పాస్‌లను తమరు పంపించారని, ఆ అభ్యర్థనను తిరస్కరిస్తున్నామని మేయర్‌కు స్పష్టం చేశారు. ప్రధాని విశాఖ రాక సందర్భంగా తమరి ఆధ్వర్యంలో జివిఎంసిలోని అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్ల ప్రతినిధి బందం ప్రధానిని కలిసి విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేయాలని ఈ నెల 4న జివిఎంసి కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. దానికి అనుగుణంగా తమరు ప్రధాన మంత్రిని కలిసే ఏర్పాట్లు చేయలేదన్నారు. ఫలితంగా చేసిన తీర్మానానికి విలువ లేకుండా పోయిందన్నారు. 20 లక్షల మంది ప్రజలకు ప్రతినిధిగా ఉండి 'ఉక్కు' కర్మాగారంపై అనాసక్తతను వ్యక్తం చేయడం తమను తీవ్ర విస్మయానికి గురి చేసిందన్నారు. రెండో వైపు మమ్మలిని ఎక్కడ దొరికితే అక్కడ అరెస్ట్ చేయాలని ప్రభుత్వం కూడా ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఒకవైపు మోడీ సభకు విఐపిల కేటగిరీలో ఆహ్వానిస్తూ రెండోవైపు అరెస్టుల కోసం ఆదేశాలు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.


సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడును అరెస్టు చేస్తున్న పోలీసులు


మాట్లాడుతున్న సురేష్

గొర్రెలగూడెం గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - చింతూరు : మండలం గొర్రెలగూడెం (స్టాపర్ పేట) గ్రామానికి రోడ్డు నిర్మాణం చేట్టాలని గిరిజన సంగం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. గొర్రెల గూడెంలో శుక్రవారం గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రహదారి, మంచినీళ్లు, విద్యుత్, వీధిలైట్లు, పోడు భూమి హక్కు పత్రాలు తదితర సమస్యలను స్థానికుల గిరిజన సంఘం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రామానికి రహదారి లేకపోవడం ప్రజలు మండల కేంద్రంలోని ఆసుపత్రికి కాలేజీకి, ఇతర అవసరాలకు రాకపోకలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణాన్ని ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డు నిర్మాణానికి శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత అభివద్ధికి విద్య, వైద్యానికి, రహదారులకు గిరిజన సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయాలని కోరారు. ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, స్వయం నారాయణ, కారం సీతయ్య, గద్దెల వనరాజు, కట్టం సీతయ్య, కారం శేఖర్, పాండ్రం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామగిరి ఆలయం పరిశీలన

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని శ్రీరాంగిరిలోని సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అల్లూరి జల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. దేవస్థానం చైర్మన్ అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. పోలవరం వలన గోదావరి నీరు స్టోరేజ్ అయితే ప్రస్తుతం ఉన్నటువంటి ఆలయం ముంపుపై స్థానిక ఆలయ అధికారులతో మాట్లాడారు. పెండింగ్ వేతనాలు పూర్తిస్థాయిలో చెల్లించాలని స్వీపర్లు కోరారు దీనిపై స్పందించిన ఏసీ ఈ నెల మినహా ఇప్పటివరకు పని చేసిన పెండింగ్ వేతనాలను ఆలయ చైర్మన్ బాలరాజు ఎండోమెంట్ బోర్డు డైరెక్టర్ కమ్మ చిచ్చు చిన్న వెంకటేశ్వర్లు జూనియర్ అసిస్టెంట్ సాయిబాబు సమక్షంలో వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ కార్య నిర్వహణ అధికారి లక్ష్మీ కుమార్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సాయిబాబు కొండయ్య ఆలయ సిబ్బంది ఆలయాల అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా దినోత్సవం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని పెదమాకవరం గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేశ్వరరావు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గిరిజన యోధుడు బిర్సాముండా జయంతి సందర్భంగా ఈ నెల 15 నుండి 21 వరకు పాఠశాలలో సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రధాని సభా వేదికపై 9 మందికే అవకాశం

ఎంవిపి.కాలనీ : ప్రధాని మోడీ, ఎపి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించనున్న విశాఖ ఎయు గ్రౌండ్స్ వేదికపై 9 మందికే ఛాన్స్ దొరకడం విశేషం. విశాఖ నుంచి వైజాగ్ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, బిజెపి ఎంఎల్‌సి పివిఎన్ మాధవ్ ఉన్నారు. నెల్లూరు ఎంఎల్‌సి, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, సిఎం రమేష్, కేంద్ర మంత్రి అశ్విన్‌కుమార్ ఉండనున్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ 10.50 నుంచి 11.30 గంటల వరకూ సుమారు 40 నిమిషాలు ప్రసంగించనున్నారు.